# విష జ్వరాల విజృంభణ

**•పెరుగుతున్న బాధితులు** **•చర్యలు చేపట్టని అధికారులు**

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

**ఉమ్మడి కర్నూలు జిల్లాలో సీజనల్ జ్వరాలు వణికిస్తున్నాయి. వాటిలో డెంగీ కేసులే అధికంగా ఉన్నాయి. డెంగీ కేసులు పెరుగుతుండటంతో జిల్లా వాసులు భయాందోళనకు గురవుతున్నారు. ఎక్కడ చూసినా ఇంటికొకరు జ్వరం బారిన పడి చికిత్స పొందుతున్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు అధికారులు చర్యలు చేపట్టకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి..**

ఉమ్మడి జిల్లాలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. చిన్నపెద్దా అనే తేడా లేకుండా వాతావరణ మార్పులతో వైరల్ ఫీవర్స్‌తో ప్రతి ఒక్కరూ బాధపడుతు న్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వారం రోజుల నుంచి ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు భారీగా కేసులు పెరుగుతున్నాయి. కర్నూలు, నంద్యాల, ఆదోని జీజీహెచ్‌ల్లో, ఎమ్మిగనూరు, బనగానపల్లె, ఆళ్లగడ్డ, డోన్, ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓపీ రోగుల సంఖ్య గణనీయంగా పెరిగాయి. ఈ ఓపీ కేసుల్లో 60 శాతం వైరల్ ఫీవర్స్‌గా నమోదవుతున్నాయి. జ్వరం, దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులకు, గొంతునొప్పి లక్షణాలతో ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తున్నారు. గత నెలతో పోలిస్తే వైరల్ ఫీవర్ కేసులు ఈనెల అధికంగా వస్తున్నాయి. ఇంట్లో ఒకరు తర్వాత మరొకరు విషజ్వరా లతో అల్లాడిపోతున్నారు. ప్లేట్‌లెట్స్ తగ్గిపోవడంతో నీరసించి ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరుతున్నారు. జ్వరం తగ్గినా ఒళ్లు నొప్పులు, జలుబు, దగ్గు మాత్రమే తగ్గడం లేదని రోగులు మళ్లీ మళ్లీ ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. కర్నూలు, నంద్యాల, ఆదోని జీజీహెచ్‌లు, డోన్‌తో పాటు ఉమ్మడి జిల్లాలోని పీహెచ్‌సీ, సీహెచ్‌సీలు ప్రైవేటు ఆసుపత్రులు, రోగులతో కిటకిటలాడుతున్నాయి. కర్నూలు జీజీహెచ్‌లో ప్రతిరోజు ఓపీకి 2700 మంది రోగులు వచ్చేవారు. పది రోజులుగా ఈ సంఖ్య పెరిగింది. ప్రతి రోజూ ఓపీకి వచ్చే రోగుల సంఖ్య 3వేలు దాటుతోంది. వీరిలో ప్రతి రోజూ 200 మంది దాకా అడ్మిషన్ పొందుతున్నారు. ఇందులో 70 శాతం వైరల్ ఫీవర్ కేసులు ఉండటం కలవరపెడుతోంది. నంద్యాల జీజీహెచ్‌లో కూడా ఓపీ రోగుల సంఖ్య 1300 నుంచి 1500 దాకా నమోదవుతున్నాయి. ఇక ఆదోని ఆసుపత్రిలో రోజు వారి ఓపీ 800 దాటుతోంది. విషజ్వరాలు పెరగడంతో కర్నూలు జీజీహెచ్‌లో పరీక్షల కోసం వేచి చూస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన సదుపాయాలు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారిక లెక్కల ప్రకారం కర్నూలు జిల్లాలో 2024లో 225 డెంగీ కేసులు నమోదు కాగా ఈ ఏడాది ఇప్పటి వరకూ 203 కేసులు నమోదయ్యాయి. సస్పెక్టెడ్ కేసులు 2024లో 1285 కేసులు రాగా ఈ ఏడాది ఇప్పటి వరకూ 2224 కేసులు వచ్చాయి. మలేరియా కేసులు 2024లో 17 రాగా ఈ ఏడాది ఇప్పటి వరకూ 9 కేసులు నమోదయ్యాయి. చికెన్ గున్యా కేసులు 2024లో 10 నమోదుకాగా ఈ ఏడాది ఇప్పటి వరకూ 11 కేసులు నమోదయ్యాయి. ఎలీసా టెస్టుల ద్వారా పాజిటివ్ వచ్చిన మాత్రమే అధికారులు డెంగీ కేసులుగా పరిగణిస్తున్నారు. అనధికారికంగా ఈ ఏడాది నమోదైన డెంగీ కేసులు వేలల్లో ఉన్నట్లు అంచనా. నంద్యాల జిల్లాలో 95 డెంగీ కేసులను గుర్తించారు. మలేరియా కేసులు 12గా గుర్తించారు. బేతంచెర్ల, నందికొట్కూరు, డోన్, నంద్యాల ప్రాంతాల్లో డెంగీ వ్యాధిగ్రస్థుల సంఖ్య అధికంగా ఉంది.

కర్నూలు జిజిహెచ్‌లో ఒపి కోసం క్యూ కట్టిన రోగులు

### పత్తాలేని పరీక్షలు

ఉమ్మడి జిల్లాలో పలు ఆసుపత్రుల్లో డెంగీ కిట్లు ఉన్నప్పటికీ నిర్ధారణ పరీక్షలు చేయడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. డెంగీతో పాటు వర్షాలు కురుస్తుండటంతో నీరు కలుషితం కావడంతో టైఫాయిడ్ కేసులు ఎక్కువగా వస్తున్నాయి. గ్రామాల్లో రెండు మూడు రోజులకు వైద్య సిబ్బంది చికిత్సలు అందించేందుకు వెళ్లడం లేదు. అన్ని పీహెచ్‌సీలో మధ్యాహ్నం 1 గంట తర్వాత వైద్యులు ఇంటి ముఖం పడుతున్నారు.

### ప్రయివేటు దోపిడీ

వైరల్ జ్వరాలు విజృంభిస్తుండటాన్ని ప్రయివేటు ఆస్పత్రులు ఆదాయంగా మలచుకుంటున్నాయి. జ్వరం వచ్చిందని ఆస్పత్రికి వెళితే చాలు తొలుత టెస్టుల పేరుతో వేలకు వేలు దండుకుంటున్నారు. ప్లేట్‌లెట్స్ (రక్త పలికలు) తగ్గాయన్న పేరుతో ఆస్పత్రిలో చేరాలని భయపెడుతున్నారు. ఆస్పత్రిలో చేరితో మందులు, బెడ్ ఛార్జీలు, డాక్టర్ ఫీజులు తదితర పేర్లతో దోచుకుంటున్నారు. ఏకంగా లక్షలు వసూలు చేస్తూ రోగుల జేబులు ఖాళీ చేస్తున్నారు.

### జాగ్రత్తలు తప్పనిసరి

జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో డెంగీ, మలేరియా పరీక్ష కిట్లు అందుబాటులో ఉన్నాయి. రోగుల నుంచి సేకరించిన నమూనాలను కర్నూలు జిజిహెచ్, ఆదోని ఏరియా ఆసుపత్రులకు వ్యాధి నిర్ధారణకు పంపిస్తారు. ఈ వ్యాధులకు మందులు కూడా అందుబాటులో ఉన్నాయి. తాగి వదిలేసిన కొబ్బరి బొండాలు, పాతటైర్లు, ఖాళీ డబ్బాలు, విరిగిపోయిన ప్లాస్టిక్ డబ్బాలు ఇంటి పరిసరాలలో ఉంచకుండా. చూడాలి. ఇంటి లోపల, బయట నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలి. నీటి తొట్టెలను వారానికి ఒకసారి ఖాళీ చేసి ఆరబెట్టి మరల నింపుకోవాలి. వాటర్ ట్యాంకులు, ఇంటిలో నీటి నిల్వల మీద దోమలు జొరబడకుండా మూతలు వేసి ఉంచాలి.

**- నూకరాజు, జిల్లా మలేరియా అధికారి.**

# ఈ-పంట నమోదు సక్రమంగా జరగాలి

**- వ్యవసాయ శాఖపై కలెక్టర్ డాక్టర్ సిరి సమీక్ష**

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సిరి

జిల్లాలో ఈ పంట నమోదు సక్రమంగా జరగాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి వ్యవసాయ శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి వ్యవసాయ , ఉద్యానవన శాఖ లపై జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్‌లో నాటిన ఉల్లి పంటకు సంబంధించి, పంట కోత ఒకేసారి జరిగలన్నారు. మార్కెట్‌కు తీసుకుని రాకుండా, 110-120 రోజులు దాటిన తర్వాతే పంట కోత తీసే విధంగా వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు పర్యవేక్షించాలన్నారు. కోత కోసిన వెంటనే మార్కెట్‌కు తీసుకొని రాకుండా ఉల్లిగడ్డను పొలంలో బాగా అరబెట్టడం వలన గడ్డల నిల్వ సామర్థ్యం పెరుగుతుందన్నారు. అదే విధంగా గ్రేడింగ్ కూడా చేసుకునే విధంగా చూడాలని సూచించారు. ఆ విధంగా కాని పక్షంలో, నాణ్యత దెబ్బతిని మార్కెట్‌లో తక్కువ ధర వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఈ అంశం పై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఉల్లి కి సంబంధించి మన రాష్ట్రంలోనూ ఇతర రాష్ట్రాలలోనూ మార్కెట్ ధరలు పరిశీలించి, గ్రామాలలోని రైతులకు వాటిపై అవగాహన కల్పించాలని సూచించారు. రైతు ఉత్పత్తి దారుల సంఘాల ద్వారా మార్కెట్ చేసే విధంగా వాటిని బలోపేతం చేయాలని సూచించారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో నాసిరకమైన విత్తనం వేసే ప్రాంతాలలో, అధిక దిగుబడి నిచ్చే మేలు రకాలను ప్రోత్సహించాలని, వాటి ద్వారా గడ్డ నాణ్యత తో పాటు, అధిక దిగుబడి రావటం ద్వారా రైతులకు అధిక ఆదాయం వస్తుందనని సూచించారు. . నీటివనరుల కింద సాగు అయ్యే పంటలకు డ్రిప్ఇరిగేషన్ పెట్టించే విధంగా ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మండల అధికారులతోనూ, రైతు సేవ కేంద్రాలలో పనిచేస్తున్న గ్రామ వ్యవసాయ, ఉద్యాన శాఖ సహాయకులతో ఆయా గ్రామాలలో వేసే పంటల సరళిపై కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ పంట నమోదు సక్రమంగా జరగాలని, ప్రతి రైతుతో క్రాప్ ఇన్సూరెన్స్ చేయించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాఉద్యాన శాఖఅధికారి రాజాకృష్ణారెడ్డి, ఏపిఎంఐపి పిడి శ్రీనివాసులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ సహాయ సంచాలకులు రాజశేఖర్, విజిలెన్స్ ఎఒ విఇ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్

# ప్రధాని సభకు రూ.కోట్లు తగలేశారు..!

**- రాష్ట్రానికి ఉపయోగం సున్నా**
**-సిపిఎం జిల్లా కార్యదర్శి డి. గౌస్ దేశాయి విమర్శ**

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మోడీ మోడీ అంటూ, నమో నమో అంటూ, మోడీ భజన కోసం కోట్లు తగలేసి సభ జరిపారుతప్పా.. రాష్ట్ర ప్రగతికి ఉపయోగపడింది సున్నా అని సిపిఎం జిల్లా కార్యదర్శి డి. గౌస్ దేశాయి విమర్శించారు. శుక్రవారం సిపిఎం కర్నూలు జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 16న ప్రధాని మోడీ పర్యటన ఆయన భజనకు ఉపయోగపడింది తప్పా రాష్ట్ర అభివృద్ధికి ఏమాత్రం ఉపయోగపడలేదన్నారు. చంద్రబాబు ఏకంగా 25 సార్లు తండ్రిని మించిన తనయుడు లోకేష్ 35 సార్లు మోడీ జపం చేశారన్నారు. రాష్ట్రానికి దేశ ప్రధాని వచ్చాడంటే, దాన్ని ఉపయోగించుకుని అభివృద్ధికి అవసరమైన నిధులను కేటాయించుకుంటారని రాష్ట్ర ప్రజలు ఎదురు చూశారన్నారు. నిధులను పక్కన పెడితే, అబద్ధపు మాటలతో, శంకుస్థాపన రాళ్లతో సభను అంకెల గారడీతో ముగించారన్నారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను బలోపేతం చేసానని తండ్రి కొడుకులు ప్రజలముందు అబద్ధం చెప్పారన్నారు. విశాఖస్టీల్ ప్లాంటును పార్లమెంటు సాక్షిగా మోడీ ప్రభుత్వం ప్రైవేటీకరణ చేస్తామని చెప్పింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. విశాఖ స్టీల్‌ను 43 యూనిట్లుగా ముక్కలు చేసి 5000 మంది కాంట్రాక్ట్ వర్కర్లను తొలగించింది వాస్తవం కాదా అన్నారు. మరో 1200 మంది పెర్మనెంట్ వర్కర్లను బలవంతంగా విఆర్ఎస్ ఇచ్చి పంపించిందన్నారు. కూటమి నాయకులు బాబు, పవన్ ఇద్దరూ కూడా విభజన హామీలపై, నిధులపై ఎందుకు మాట్లాడలేదని, పొగడ్తల కోసమే సభ పెట్టారని విమర్శించారు. మోడీ ఉపన్యాసం అంతా పవర్ జనరేషన్, ఇంధన విప్లవం, గ్యాస్, ఎఐ గూగుల్ గురించి తప్ప, ఒక్క మాట కూడా వెనకబడ్డ రాయలసీమ గురించి, అభివృద్ధి గురించి ప్రస్తావన లేదన్నారు. చేసిన శంకుస్థాపనలు కూడా గతంలో బడ్జెట్లో కేటాయించినవే తప్ప కొత్తగా ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. మోడీ పర్యటన వల్ల జిల్లాకు రాష్ట్రానికి ఆర్థికంగా నష్టం తప్ప లాభం సూన్యమని అన్నారు. పైగా ఈ వారం రోజులపాటు పరిపాలన మొత్తం స్తంభించిపోయిందన్నారు. అభివృద్ధి పట్టని పాలకులను ప్రజలే ప్రశ్నించాలని, పోరాటాల ద్వారానే నిధులను రాబట్టాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.ఎస్ రాధాకృష్ణ, జి.రామకష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎండి.ఆనంద్‌బాబు, టి.రాముడు, ఎండి అంజిబాబు, ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ పాల్గొన్నారు.

# సాక్షి ఎడిటర్‌పై అక్రమ కేసులు ఎత్తేయాలి

**-కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టు సంఘాలు ధర్నా**
**-జాయింట్ కలెక్టర్‌కు, గాంధీ విగ్రహానికి వినతి**

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డి, వివిధ జిల్లాల రిపోర్టర్లపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని జర్నలిస్టు సంఘాలు డిమాండ్ చేశాయి. శుక్రవారం సాక్షి ఎడితర్, రిపోర్టర్లపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట సీనియర్ జర్నలిస్టులు, జర్నలిస్టు, సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోరంట్లప్ప, నగర నాయకులు శ్రీనివాసులు, ఎపియుడబ్ల్యుజెఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస గౌడ్, జిల్లా సీనియర్ నాయకులు పి.చంద్రయ్య, రాయలసీమ జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.శ్రీనివాసులు మాట్లాడారు. నెల్లూరు జిల్లా పోలీసులు సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డిపై అమానుషంగా వ్యవహరిస్తున్నారన్నారు. నోటీసులు ఇచ్చే పేరుతో రెండు రోజులుగా హైదరాబాద్‌లోని సాక్షి కార్యాలయంలో తిష్టవేసి సోదాలు చేయడం దారుణమన్నారు. పోలీసుల తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. వెంటనే సాక్షి ఎడిటర్, రిపోర్టర్లపై పెట్టిన కేసులను ఎత్తివేయాలన్నారు. కూటమి ప్రభుత్వం మీడియాపై కక్షసాధింపు చర్యలు విరమించుకోవా లని డిమాండ్ చేశారు. అనంతరం జెసి నూరుల్ ఖమర్‌కు వినతిపత్రం సమర్పించారు. అంతకుముందు కలెక్టరేట్ ఎదుట ఉన్న గాంధీ విగ్రహానికి కూడా వినవి పత్రాన్ని అందించారు. సాక్షి బ్యూరో, ఎడిషన్ ఇన్‌ఛార్జీలు ఎం.రవికుమార్, శ్రీనివాసులు నాయుడు, సీనియర్ ఫొటోగ్రాఫర్ డి.హుస్సేన్, ఎపియుడబ్ల్యుజె నాయకులు అవినాష్ శెట్టి, ఎపియుడబ్ల్యుజెఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎం.శివశంకర్, ఎర్రమల, సీనియర్ నాయకులు సునీల్‌కుమార్, మణిబాబు, సీనియర్ జర్నలిస్టులు రవిప్రకాష్, చంద్రమోహన్, శ్రీనాథ్ రెడ్డి, పుల్లంరాజు, హరి పాల్గొన్నారు.

గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

## హైకోర్టు విషయంలో సిఎం పాతపాట

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

హైకోర్టు విషయంలో కర్నూలులో హైకోర్టు బెంచ్ త్వరలోపెడుతున్నామని మళ్లీ పాత పాటనే పాడారని ఆల్ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా అధ్యక్షులు సింగరాజు లక్ష్మణ్ విమర్శించారు. గతంలో ఐదు సంవత్సరాలు పరిపాలించారని, రెండోసారి అధికారం వచ్చి ఏడాదిన్నర పూర్తయిందన్నారు. ఎంత కాలానికి బెంచ్ ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. కేంద్రంలోనూ మీ మద్దతు తో నడుస్తున్న ప్రభుత్వం ఉంది రాష్ట్రంలో మీ కూటమి ప్రభుత్వం ఉంది. గతంలో ఐదేళ్లు అదేమాట చెప్పారని, ప్రస్తుతం కూడా కొత్తేమి లేదని అన్నారు. సాగదీయకుండా వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దేశ ప్రధాని మన జిల్లాకు వచ్చినా హైకోర్టు విషయాన్ని ఆయన చేత చెప్పించలేకపోయారని విమర్శ చేశారు. రాజకీయాలు పక్క పెట్టి కర్నూలు ప్రజల ఆకాంక్ష అయిన హైకోర్టు లేదా హైకోర్టు బెంచ్ తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

## పరీక్షల విభాగంపై విచారణ : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీలో పరీక్షల విభాగంలో జరుగుతున్న అవినీతిపై విచారణ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ యూనివర్సిటీ కన్వీనర్ రామకృష్ణ ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రాయలసీమ వర్సిటీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీలో పరీక్షా నిర్వహణ పూర్తిగా విఫలం చెందిందన్నారు. అనేక మార్లు పేపర్లు లీకైనా పరీక్షా విభాగం అధికారిపై చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటని అన్నారు. పరీక్షా విభాగంలో అనేక అవకతవకలు అవినీతి జరిగిందన్నారు. గతంలో ఉన్న అధికారులు వాటిపై కమిటీలు వేశారని, నివేదికలు బయట పెట్టకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నా రన్నారు. అవినీతికి పాల్పడిన పరీక్షా విభాగం అధికారిపై చర్యలు తీసుకోకుండా తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని పరీక్షల విభాగాన్ని ప్రక్షాళన చేయాలన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సందీప్ నాయక్, ఓబులేసు, సందీప్, కిరణ్, తేజ, కరుణాకర్, గణేష్, దాసు, ప్రశాంత్, కృపాకర్ పాల్గొన్నారు.

## నేడు గుండ్రేవులపై రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు ప్రగతి సమితి (కెపిఎస్) ఆధ్వర్యంలో గుండ్రేవుల ప్రాజెక్టు సాధనకు సంబంధించి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షులు ఎం. శ్రీహర్ష ఓ ప్రకటనలో శుక్రవారం పేర్కొన్నారు. ఈ సమావేశం బిర్లా కాంపౌండ్‌లోని కెపిఎస్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు, మేధావులు, విద్యార్థి ఉద్యమ నేతలు హాజరవుతారని పేర్కొన్నారు.

## భూ రీ సర్వేలను ముమ్మరం చేయండి

ప్రజాశక్తి-సి బెలగల్

సి బెళగల్ మండలంలో పలు గ్రామాల్లో నత్తనడకన సాగుతున్న భూ రీ సర్వేలను ముమ్మరం చేయాలని తహసీల్దార్ వెంకట లక్ష్మి సంబందించిన అధికారులకు సూచించారు. శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. భూ రీసర్వేలో బ్రాహ్మణ దొడ్డి రెవిన్యూ పంచాయతీ పూర్తిగా వెనుక బడిందని అన్నారు. పోలకల్‌లో, సంఘాల, గుండ్రేవుల, బురాన్ దొడ్డి రెవిన్యూలో సర్వేయర్లు, విఆర్ఇఒలు అలసత్వం వీడాలని తెలిపారు. ఎల్ పిఎం నంబర్లు తయారు చేయుటలో నిర్లక్ష్యం తగదని అన్నారు. జాయింట్ నంబర్లు వెంటనే తొలగించి రైతుల సమస్యలు పరిష్కరించాలన్నారు.

# ఉమ్మడి జిల్లా ప్రజలకు కృతజ్ఞతలు

**-చరిత్రలో నిలిచిపోయేలా మోడీ సభ-మారనున్న కర్నూలు రూపురేఖలు**
**-వైసిపిది అబద్ధాల చరిత్ర -టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు**
**-కర్నూలు గురించి ప్రపంచానికి తెలిసింది : మంత్రి టిజి భరత్**

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

జిల్లాలో నిర్వహించిన సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ సభను విజద విజయవంతం చేసిన ప్రజలకు కృతజ్ఞత తెలపుతున్నామని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, పరిశ్రమలశాఖ మంత్రి టిజి.భరత్, టిడిపి జిల్లా అధ్యక్షులు పి.తిక్కారెడ్డి , వైసిపి జిల్లా నాయకులు సురేష్ కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు గౌరుచరితరెడ్డి, బొగ్గుల దస్తగిరి, అన్నారు. శుక్రవారం టిడిపి కర్నూలు జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు పి తిక్కారెడ్డి అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు.

పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జిఎస్‌టి సభతో కర్నూలు శక్తివంతమైన జిల్లాగా రుజువైందన్నారు. ఈ సభ ప్రజల్లో, పార్టీ కార్యకర్తల్లో నాయకుల్లో నూతన ఉత్తేజాన్ని నింపిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో జనసేన, బిజెపి, సహకారంతో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. రూ.పదివేల కోట్ల పెట్టుబడులు కర్నూలుకు రానున్నాయన్నారు. రాష్ట్రాన్ని సమపాళ్లలో అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో చంద్రబాబు నాయుడు విశాఖలో డేటా సెంటర్‌ను, అనంతపురంలో స్పేస్ హబ్బును ఆటోహబ్‌ను, అమరావతిని క్వాంటం వ్యాలీగా, కర్నూలు ఓర్వకల్లు, ఇండస్ట్రియల్ కారిడార్ తోపాటు హైడ్రోజన్, గ్రీన్ టెక్ విద్యుత్ ట్రాన్సిస్టర్ కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. తొలి నుంచి వైసిపిది అబద్దాల చరిత్ర అన్నారు.

మంత్రి టిజి.భరత్ మాట్లాడుతూ... మోడీ జిఎస్‌టి సభకు ప్రజలు స్వతహాగా తరలివచ్చారని జిల్లా చరిత్రలో ఇంత పెద్ద సభ నిర్వహించిన చరిత్రలేదన్నారు. భవిష్యత్తులో ఏ సభ జరిగినా మోడీ సూపర్ జిఎస్‌టి సభకు ముందు, వెనుక అనేలా ప్రపంచం చర్చించుకుంటుందన్నారు. జిఎస్‌టి సభలో తాము వినతిపత్రం ఇవ్వడం వల్లనే మోడీ ప్రకటనలు సాధ్యమయ్యాయని వైసిపి నాయకులు చెప్పుకోవడం సిగ్గుచేటుగా ఉందన్నారు. వైసిపి నాయకులు అబద్ధ ప్రచారాలు మానుకోవాలన్నారు. జిఎస్‌టి జాబితాలో అనుమతి లేకుండా వైసిపి నాయకులు ఏ విధంగా వినతి పత్రం సమర్పించారో వారే తెలియచెప్పాలన్నారు. రూ.పదివేలకోట్ల పెట్టుబడులకు హామీ లభించిందన్నారు. భవిష్యత్తులో కర్నూలు రూపురేఖలు మారనున్నాయన్నారు.

టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహకారం తోడవడం వల్ల డబుల్ ఇంజన్ సర్కార్ అభివృద్ధి వైపు రాష్ట్రం పరుగులు తీస్తుందన్నారు. సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ కార్యక్రమం బహిరంగ సభ జయప్రదం కోసం ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజలు ఇచ్చిన సహకారం మరువలేనిదని అన్నారు. అహర్నిశలు మంత్రులు కూటమి ప్రభుత్వ ఎమ్మెల్యేలు ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధికారులు ఆకుంఠిత దీక్షతో కృషి చేశారన్నారు. వారి కషి అభినందనీయమన్నారు. ప్రధానంగా జిల్లా కలెక్టర్, ఎస్‌పి ప్రభుత్వ యంత్రాంగం కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సభ విజయవంతానికి కృషి చేశారని చేశారన్నారు. ఎంపి బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా ప్రజలు చరిత్ర సృష్టించారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా హామీలను అమలు చేస్తున్నారన్నారు. దేశంలో 13 పారిశ్రామిక కేంద్రాలు ఉండగా మన రాష్ట్రంలోనే ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామిక కేంద్రాలు ఏర్పాటు చేయడం గర్వకారణం అన్నారు. వలసలకు నిలయమైన కర్నూలు జిల్లా అభివృద్ధిలో పరుగులు పెట్టనుందన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత మాట్లాడుతూ.. పాణ్యం నియోజకవర్గంలో సభ నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. రూ.2786 కోట్లతో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌తో పాటు, రూ.13,500 కోట్ల పనులను ప్రారంభించడం హర్షణీయమన్నారు. ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ... ప్రధానమంత్రి మోడీ సహకారం, చంద్రబాబు నాయుడు విజన్‌తో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకెళ్తోందని అన్నారు. భవిష్యత్తులో మరెన్నో పరిశ్రమలు జిల్లాకు రావాలని ఆకాంక్షించారు. జనసేన రాష్ట్ర నాయకులు చింత సురేష్ మాట్లాడుతూ... బహిరంగ జయప్రదం చేయడం వెనుక ఎంతో కృషి ఉందన్నారు. డిసిఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్, కుడాచైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, నియోజకవర్గ ఇన్చార్జులు సభను విజయవంతం చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

సభ విజయవంతమైందని ప్రజలకు అభివాదం చేస్తున్న టిడిపి , మంత్రి, ఎమ్మెల్యేలు

## రాజవర్ధన్ రెడ్డి స్మారక బాస్కెట్ బాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

స్థానిక స్పోర్ట్స్ అథారిటీ అవుట్‌డోర్ స్టేడియంలో రాజవర్ధన్‌రెడ్డి స్మారక బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిధులుగా ఉమామహేశ్వర్‌రెడ్డి, గౌతమ్‌రెడ్డి పాల్గొని పోటీలను లాంచనంగా ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గెలుపు ఓటములను పక్కనపెట్టి పాల్గొనడమే ప్రధాన ధ్యేయంగా ఉండాలని క్రీడాకారులకు ఉద్బోధించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాజవర్ధన్ రెడ్డి స్మారకార్థం, ఆయన జయంతి సందర్భంగా క్రీడాకారుల సమక్షంలో కేకును కట్ చేసి జయంతిని జరుపుకున్నారు. ఈ టోర్నమెంటులో బాస్కెట్ బాల్ 35 జట్లు పాల్గొనడం చాలా సంతోషమని బాస్కెట్బాల్ జిల్లా కార్యదర్శి భానుప్రసాద్ అన్నారు. బాస్కెట్ బాల్ సభ్యులు దాదాబాష, వ్యాయామ ఉపాధ్యాయులు ముస్తఫీర్, చిన్న సుంకన్న, సబీర్, ప్రతాప్, వలి, సురేంద్ర, మధు, రఘు, షాషా, సెహన్నా, మహిళా వ్యాయామ ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు.

విష్ణుసేన ఆధ్వర్యంలో క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

## మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేయొద్దు

**వైసిపి జిల్లా అధ్యక్షుడు ఎస్ వి మోహన్ రెడ్డి**

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

మాట్లాడుతున్న ఎస్ వి మోహన్ రెడ్డి

ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేస్తే చంద్రబాబు చరిత్రహీనుడిగా మిగిలి పోతారని వైసిపి కర్నూలు కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్‌వి. మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కాపాడుకుందామని కర్నూలు నియోజకవర్గం విస్తృత స్థాయి సమావేశం శ్రీ లక్ష్మి ఫంక్షన్‌హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు కూటమి ప్రభుత్వం మోసాలపై ప్రజలను చైతన్య చేసి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం కాకుండా కోటి సంతకాల సేకరణకు కృషి చేయాలని ఎస్‌వి.మోహన్ రెడ్డి కోరారు. తెలుగు దేశం పార్టీ నేతలు, మంత్రి నారా లోకేష్ పిపిపి విధానం తో రూ.10 వేల కోట్ల విలువైన 12 ప్రభుత్వ మెడికల్ కళాశాలలకు బినామీలను పెట్టి దోచుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు కోటి సంతకాల సేకరణ చేపట్టామని త్వరలోనే రాష్ట్ర గవర్నర్ దృష్టి తీసుకొని వెళ్ళి ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించకుండా అడ్డుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌వి.విజయమనోహరి, నగర అధ్యక్షుడు అహ్మద్ అలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వ్యర్థాలపై అవగాహన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరంలోని బి-క్యాంప్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలలో ఆధ్వర్యంలో 'ప్లాస్టిక్ వ్యర్థాలవలన కలిగే పర్యావరణ సమస్యలు" అనే అంశంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. నాగ స్వామి నాయక్ మాట్లాడుతూ ప్లాస్టిక్ మన జీవితంలో సౌకర్యం కలిగిస్తున్నప్పటికీ, దాని నిర్లక్ష్య వాడకం పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తోందని తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాలు మట్టి, నీరు, గాలిని కలుషితం చేయడంతో పాటు భూగర్భ జలాల నాణ్యతను తగ్గిస్తున్నాయన్నారు. జంతువులు , సముద్ర జీవులకు ఇది ప్రాణహాని కలిగిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో లెక్చరర్స్ రామకృష్ణ, విజయశేఖర్, మల్లికార్జున, సోమేష్, శ్రీధర్, బాల శంకర్ విద్యార్థులు పాల్గొన్నారు.జిజిహెచ్ కొత్త సీఎస్ఆర్ఎంఒగా డాక్టర్ పి. పద్మజ బాధ్యతలు స్వీకారం.

## టీచరు విష్ణు వందనాదేవికి నివాళి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉపాధ్యాయురాలు విష్ణు వందనాదేవి రెండు రోజుల క్రితం మృతి చెందడంతో శుక్రవారం ఉపాధ్యాయులు ఘనంగా నివాళులర్పించారు. కర్నూలు నగరంలోని జోహారాపురం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఆమె స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సర్దార్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి పట్ల ఎంతో నిబద్ధతతో ఆమె పనిచేసేదని పేర్కొన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో ఆమె చేసిన సేవలు ఎనలేని కొనియాడారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

## వాగ్దానాలు అమలు చేయాలి : సిఐటియు

**ప్రజాశక్తి-ఆదోనిరూరల్**

ప్రభుత్వ రంగంలో అవుట్‌సోర్సింగ్, అసంఘటిత కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న, రామాంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం సుందరయ్య భవనంలో సిఐటియు మండల 3వ మహాసభలను నిర్వహించారు. సిఐటియు మండల అధ్యక్షులు రామాంజనేయులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి వీరారెడ్డి, పట్టణ కార్యదర్శి తిప్పన్న మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చి 18 నెలలు పూర్తయినా ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయలేదని విమర్శించారు. ప్రజలు, కార్మికుల సమస్యలు పరిష్కరించలేదని తెలిపారు. అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేస్తామని మాట ఇచ్చి, ఇప్పటివరకు అమలు చేయలేదని మండిపడ్డారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. లేకపోతే దశలవారీగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, వీరారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా సోమక్క, వరలక్ష్మి, అల్లప్ప, లక్ష్మన్న, ముస్తఫా, హనీఫ్, సుకన్య, లావణ్య, రాజేశ్వరి, లత, శేఖర్, చిరంజీవిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

# పందుల స్వైరవిహారం..!

- నిబంధనలు గాలికి...
- రోగాల బారిన ప్రజలు
- పట్టించుకోని అధికారులు

**ప్రజాశక్తి - హోళగుంద**

**హోళగుందలో పందుల బెడద ప్రజలను వేధిస్తోంది. నిబంధనల ప్రకారం పందులను ఊరికి దూరంగా వదిలేయాలి. నిబంధనలను గాలికి వదిలేయడంతో గ్రామంలో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. అపరిశుభ్రతతో దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. అధికారులు అలసత్వం వీడి పందులను ఊరికి దూరంగా తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.**

హోళగుందలోని ఏ వీధిలో చూసినా పందులు స్వైరవిహారం చేస్తూ మహిళలపై దాడికి దిగుతున్నాయి. పందుల యజమానులు పందులను గ్రామంలో వదిలేసి గుట్టుచప్పుడు కాకుండా ఉంటున్నారు. ఎవరైనా 'పందులు మీవే' అని ప్రశ్నిస్తే.. 'మావి కావు. సంబంధం లేదు' అంటూ మాట దాటవేస్తూ తప్పించుక తిరుగుతున్నారు. ప్రస్తుతం వర్షాలు అధికంగా కురుస్తుండడంతో చెత్తాచెదారం పేరుకుపోయి అపరిశుభ్రత ప్రాంతాల్లో పందులు సంచరిస్తూ నివాసయోగ్యమైన ఇళ్ల ముందుకొస్తూ కొన్ని చోట్ల ఇళ్లలోకి చొరబడుతున్నాయి. పందుల వల్ల అనారోగ్యం పాలవుతున్నామని గ్రామస్తులు మొరపెట్టుకుంటున్న మేజర్ పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరం.

నిబంధనలు గాలికి..!

నిబంధనల ప్రకారం పందుల యజమానులు ఊరికి చివరన సంచారం లేని చోట షెడ్ ఏర్పాటు చేసుకొని పందులను పెంచుకోవచ్చు. పందుల యజమానులు నిబంధనలు గాలికి వదిలేసి జనసంచారం ఉన్నచోట.. ఊరి మధ్యలో పందులను వదిలేసి చేతులు దులుపుకుంటున్నారు. పందులు గ్రామాల్లో నివాసయోగ్యమైన ప్రాంతాల్లో దర్జాగా తిరుగుతూ ప్రజలు అనారోగ్యం పాలు కావడానికి కారణం అవుతున్నాయి. కూలినాలీ చేసిన డబ్బును వైద్యం కోసం ఖర్చు పెట్టి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పందులను తోలడానికి వెళ్లిన మహిళలపై దాడికి దిగుతూ కరవడానికి వస్తున్నాయి. పందులతో కలిసి జీవనం చేసినట్లుందని మహిళలు వాపోతున్నారు.

**అధికారుల అలసత్వం**

పందులు గ్రామాల్లో సంచరిస్తుంటే అధికారులు ఏమీ పట్టనట్లు నిర్లక్ష్యం వహిస్తున్నారు. వాడవాడలా పరిశుభ్రతే పాటు పందులు, ఇతర ఏ జంతువులు ప్రజలకు హాని కలిగించినా వాటిని దూరంగా ఉంచడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పందులు గ్రామాల్లో సంచరించకుండా చర్యలు చేపట్టాలని, లేకపోతే మండల కార్యాలయాల ముందు ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

**ఇళ్లలోకి చొరబడుతున్న పందులు**

**- హెచ్.మల్లేశప్ప, హోళగుంద**

పందులు ఇళ్లలోకి చొరబడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఊరి బయట ఉండాల్సిన పందులను గ్రామంలో కొంతమంది ఉంచుకొని 'మాకు సంబంధించినవి కావు.. ఎవరివో మాకు తెలియదు' అంటూ బుకాయిస్తున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకొని గ్రామం నుంచి పందులను దూరంగా తరలించాలి.

**రోగాల బారిన పడుతున్నాం**

**- బుదగ జంగాల కాలనీవాసి రామాంజనేయులు**

పందుల వల్ల రోగాల బారిన పడుతున్నాం. ఎక్కడ చూసినా పందులు దర్శనమిస్తున్నాయి. ఉన్నత పాఠశాల ఆవరణలోనూ పందులు కనిపిస్తున్నాయి. మహిళలు, చిన్నపిల్లలపై దాడులకు తెగబడుతున్నాయి. ఇప్పటికే గ్రామాల్లో అక్కడక్కడ అపరిశుభ్రత తాండవిస్తోంది. దానికి తోడు పందులు సంచరించడం వల్ల ఇంకొంచెం రోగాలను కొని తెచ్చుకున్నట్లు ఉంది. సంబంధిత అధికారులు పందులను ఊరి బయటకు తరలించేలా చర్యలు తీసుకోవాలి. పందుల యజమానులను గుర్తించి గ్రామాల్లో పందులను సాకితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించాల్సిన బాధ్యత అధికారులకు లేదా..?

## 'సిద్ధేశ్వర' సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**ప్రజాశక్తి- ఆలూరు**

ఆలూరులోని సిద్ధేశ్వర కాలనీలో ప్రజలు ఎదు ర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సిపిఎం ఆలూరు ప్రాంతీయ కార్యదర్శి పి.హనుమంతు, సీనియర్ నాయకులు కెపి.నారాయణస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం కాలనీ వాసులతో కలిసి ఆలూరు మేజర్ పంచాయతీ అధికారి వినోద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆలూరులోని సిద్ధేశ్వర కాలనీలో స్థలాలు లేని పేదలందరూ 15 ఏళ్ల నుంచి కొట్టాలు వేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. కాలనీలో వీధిలైట్లు, సిసి రోడ్లు లేక కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాత్రివేళ విష పురుగుల వల్ల ప్రజలు బయటకు రావాలంటే భయపడే పరిస్థితి ఉందని చెప్పారు. ఈ విషయాన్ని అనేకసార్లు కాలనీవాసులు పంచాయతీ కార్యదర్శి, సర్పంచి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. పంచాయతీ అధికారులు స్పందించి అంధకారంలో ఉన్న సిద్ధేశ్వర కాలనీలో వీధిలైట్లు ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు ఈరన్న, విఠల్, శేఖర్, గోపాల్, కాలనీవాసులు రాధమ్మ, విజయలక్ష్మి, మాధవి, పార్వతి, ఈరమ్మ పాల్గొన్నారు.

## మరో విద్యార్థి మృతదేహం వెలికితీత

**ప్రజాశక్తి - గోనెగండ్ల**

గోనెగండ్ల మండలం గాజులదిన్నె ప్రాజెక్టు వద్ద మరో విద్యార్థి మృతదేహాన్ని వెలికితీశారు. గురువారం గోనెగండ్లలోని గాజులదిన్నె ప్రాజెక్టు వద్దకు విహారానికి వచ్చి ఇంజినీరింగ్ విద్యార్థుల్లో ఇద్దరు గల్లంతు కాగా ఒకరి మృతదేహాన్ని వెలికితీయగా... మరో విద్యార్థి ఎం.ఉదయ్ కుమార్ (20) మృతదేహం లభ్యం కాలేదు. శుక్రవారం ఉదయం నుంచే రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్ సిబ్బంది స్థానిక జాలర్లతో ఉదయ్ కుమార్ మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. 7.30 గంటల సమయంలో జాలర్లు ఉదయ్ మృతదేహాన్ని గుర్తించి వెలికి తీశారు. తహశీల్దార్ పి.రాజేశ్వరి ప్రాజెక్టు వద్దకు చేరుకుని ఘటన స్థలం, ఘటన వివరాల గురించి ప్రాజెక్టు సిబ్బందిని అడిగి తెలుసుకుని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎమ్మిగనూరు ఆస్పత్రికి తరలించారు. ఆర్ఐ రామయ్య, ఎఫ్‌డిఓ మద్దిలేటి, ప్రాజెక్టు వర్క్ ఇన్‌స్పెక్టర్ ఉగ్ర నరసింహ, స్థానిక మత్స్యకారులు ఉన్నారు.

సంఘటన స్థలం వద్ద పరిశీలిస్తున్న తహశీల్దార్

## ఆగని వలసలు

**ప్రజాశక్తి - కోసిగి**

మండలంలో వలసలతో గ్రామాలు ఖాళీ అవుతున్నాయి. మండలంలో 24 పంచాయతీలు ఉన్నాయి. ప్రతి పంచాయతీ నుంచి రోజూ 20 నుంచి 30 కుటుంబాలు సుదూర ప్రాంతాలకు పిల్లాపాపలతో కలిసి వలస వెళ్తున్నాయి. ఆరుగాలం కష్టపడి పని చేసినా రైతన్నకు పొలంలో నష్టాలే మిగులుతున్నాయి. సరయిన గిట్టుబాటు ధర లేక పండించిన పంటలు అతివృష్టి, అనావృష్టి వల్ల నష్టపోతూనే ఉన్నారు. పంట కోసం తెచ్చిన అప్పులు తీర్చలేక వలస బాట పడుతున్నారు. ఇప్పటికీ మండలంలో వేలాదిమంది, వందలాది వాహనాల్లో గుంటూరు, హైదరాబాద్, కర్ణాటక వంటి ప్రాంతాలకు వలస వెళ్లిపోయారు. గ్రామాల్లో ఏ గడప చూసినా తాళాలే దర్శనమిస్తాయి. తమతో పాటు చదువుకుంటున్న విద్యార్థులను సైతం వెంట తీసుకెళ్తున్నారు. అధికారులు, నాయకులు స్పందించి వలసలను కట్టడి చేసి మండలంలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే మండల అభివృద్ధి జరిగి కొంతమందికి ఉపాధి కల్పించే విధంగా ఉంటుందని గ్రామస్తులు కోరుతున్నారు.

బొలెరోలో వలస వెళ్తున్న కూలీలు

**అప్పులు తీర్చలేక వలసలు : సిఐటియు మండల కార్యదర్శి రాముడు, కోసిగి**

కోసిగి మండలం అంటేనే వలసలకు మారుపేరుగా మారింది. రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం, అధిక వర్షాలతో పంట పూర్తిగా నష్టపోవడం, పంట కోసం తెచ్చిన అప్పులు తీర్చలేక పిల్లాపాపలతో కలిసి గ్రామస్తులంతా వలస వెళుతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా మండలానికి పరిశ్రమ ఏర్పాటు చేస్తే వేలాదిమందికి ఉపాధి కల్పించినట్లు అవుతుంది.

## అందుబాటులోకి నూతన భవనాలు

**- ప్రజాశక్తి కథనానికి స్పందన**

చిప్పగిరి సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు

**ప్రజాశక్తి - చిప్పగిరి**

సచివాలయ నూతన భవనాలు అందుబాటులోకి వచ్చాయి. 'నూతన భవనాలకు వెళ్లని సచివాలయ సిబ్బంది' అనే శీర్షికన ప్రజాశక్తి పత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంపిడిఒ అల్లా బకాష్ చొరవ చూపడంతో నగరడోనా, చిప్పగిరి సచివాలయాలు అందుబాటులోకి వచ్చాయి. శుక్రవారం ఎంపిడిఒ మాట్లాడారు. సచివాలయ భవన నిర్మాణాలు పూర్తి చేసిన నేపథ్యంలో భవనాల్లో నీరు, విద్యుత్ వసతి కల్పించాలని నగరడోనా, చిప్పగిరి సర్పంచులు మల్లమ్మ, దాసరి గోవిందరాజులుకు తెలియజేసినట్లు చెప్పారు. వారు కూడా స్పందించి పంచాయతీ కార్యదర్శులు ప్రమీల, సిసింద్రీ సహకారం తీసుకొని సమస్యలను పరిష్కరించడంతో సచివాలయ అధికారులందరూ నూతన సచివాలయ భవనాల్లోకి వెళ్లి విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. నూతన సచివాలయ భవనాల్లో విధులు నిర్వర్తిస్తున్నందున సచివాలయాలకు వెళ్లి సమస్యలను పరిష్కరించుకోవచ్చని ఇరు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పేదరిక నిర్మూలనలో భాగస్వామ్యం కావాలి

**- లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్ డాక్టర్ గోపీనాథ్**

**ప్రజాశక్తి - ఆదోని**

మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తున్న సిబ్బంది

పేదరిక నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యమవుతూ లేనివారికి సహాయం అందించాలని లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్ డాక్టర్ గోపీనాథ్ కోరారు. శుక్రవారం అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం సందర్భంగా పేద మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతేడాది అక్టోబర్ 17న అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ప్రపంచంలో ఉన్న అన్ని దేశాల్లోనూ అత్యంత పేద దేశాలేవి, అందులో నివసించే ప్రజలెలా పేదరికంలో మగ్గుతున్నారు, వారిని ఎలా ఆర్థికంగా పైకి తేవాలన్న విషయాలను క్షుణ్ణంగా చర్చించి, ఆచరణ యోగ్యమైన కొన్ని కార్యక్రమాలు లయన్స్ క్లబ్ ద్వారా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వ్యాపారులు, ఉద్యోగులు కష్టంలో కొంత భాగం సేవా కార్యక్రమాలకు కేటాయించాలని కోరారు. సాటి మనిషికి సహాయం చేసి వారి ఉన్నతికి తోడ్పాటునందించాలని తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఆదోని ప్రాంతానికి చెందిన మహిళలకు 8 కుట్టు మిషన్లు పంపిణీ చేసేందుకు ముందుకు వచ్చామన్నారు. లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్ ప్రసాదరావు, అధ్యక్షులు ధర్మారెడ్డి, కోశాధికారి వనప రాజు, క్లబ్ విశిష్ట సభ్యులు మంతా రమేష్ పాల్గొన్నారు.

# మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను మానుకోవాలి

**- ఎమ్మెల్యే విరుపాక్షి**
**- వైసిపి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ**

**ప్రజాశక్తి - దేవనకొండ**

ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరణ చేసే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఎమ్మెల్యే బి.విరుపాక్షి డిమాండ్ చేశారు. శుక్రవారం వైసిపి దేవనకొండ కార్యాలయంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేద, మధ్యతరగతి విద్యార్థుల ప్రయోజనార్థం జిల్లాల వారీగా వైద్య విద్య, వైద్య సేవలు అందించేందుకు తీసుకొచ్చిన మెడికల్ కళాశాలలను ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించడం దారుణమన్నారు. పేద విద్యార్థులకు వైద్య విద్య అందనంత దూరం పోతుందని తెలిపారు. రూ.లక్షల కోట్లు విలువ చేసే ప్రభుత్వ ఆస్తులు ప్రయివేట్‌పరం అవుతాయని చెప్పారు. మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలను తీసుకోకుండా ఉండాలని తెలిపారు. జడ్‌పిటిసి కిట్టు, వైసిపి నాయకులు కందనాతి రంగన్న, కబీరు, పెనుమాడ రామాంజనేయులు, బోయ అంజి, లక్ష్మి నారాయణ పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** పట్టణంలో కోటి సంతకాల, వాడవాడలా వైసిపి కార్యక్రమం నిర్వహించారు. వైసిపి పట్టణ అధ్యక్షులు కామర్తి నాగేశప్ప, 9వ వార్డు కౌన్సిలర్, రాష్ట్ర సాంస్కృతిక విభాగం ప్రధాన కార్యదర్శి రాజారత్నం, మున్సిపల్ వైస్ ఛైర్మన్ డి.నజీర్ అహ్మద్, 10వ వార్డు కౌన్సిలర్ సుధాకర్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పిపిపి విధానం పేదలకు తీవ్ర అన్యాయం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి బీసీ సెల్ పట్టణ కార్యవర్గ సభ్యులు, 9వ వార్డు అధ్యక్షులు టికె.గౌస్, వైసిపి ఎస్సీ సెల్ జిల్లా కార్యవర్గ సభ్యులు గుమ్మల చిన్న, వార్డు ప్రధాన కార్యదర్శులు గౌరమ్మ, టికె.హజరత్ బీ, కార్యదర్శులు ఎస్.అల్లాబకాష్, వై.జిలాన్, కె.ఫక్రుద్దీన్, నిరంజన్, 9వ వార్డు కార్యకర్తలు అల్లా బకాష్, పెద్దయ్య, ప్రసాద్, రజ్జబ్, కటిక షరీఫ్, నియోజకవర్గ సోషల్ మీడియా అధ్యక్షులు ఎస్ఎమ్‌డి.షరీఫ్, జిల్లా సోషల్ మీడియా కార్యదర్శి కదిరికోట రాజ్ కుమార్, సోషల్ మీడియా సభ్యులు జశ్వంత్ పాల్గొన్నారు.

దేవనకొండలో సంతకాల సేకరణలో ఎమ్మెల్యే విరుపాక్షి

ఎమ్మిగనూరులో మాట్లాడుతున్న నాగేశప్ప

# శ్రీమఠంలో పల్లా శ్రీనివాసరావు

**ప్రజాశక్తి - మంత్రాలయం**

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామిని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు దర్శించుకున్నారు. స్వామి వారి దర్శనార్థమై మంత్రాలయం వచ్చిన ఆయనకు టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, టిడిపి ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి, టిటిడి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి, మంచాల సొసైటీ సింగిల్ విండో ఛైర్మన్ ఎన్.రామకృష్ణా రెడ్డి స్వాగతం పలికారు. శుక్రవారం శ్రీమఠానికి చేరుకున్న వారికి శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు సాదరంగా స్వాగతం పలికారు. గ్రామ దేవత మాంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళ హారతులు స్వీకరించారు. అనంతరం వారికి శ్రీమఠం నుంచి మేనేజర్ శ్రీనివాసరావు శాలువా వేసి సన్మానించారు. టిడిపి నాయకులు నరవ రమాకాంత్ రెడ్డి, కౌతాళం సీనియర్ నాయకులు ఉల్లిగయ్య, పల్లెపాడు రామిరెడ్డి, ముత్తురెడ్డి, ఎస్ఎం.గోపాల్ రెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, చావిడి వెంకటేష్, టిప్పు సుల్తాన్, సురేష్ నాయుడు, విజయరామిరెడ్డి, చిన్న భీమా, పవన్ కుమార్, హండే హనుమంతు, సున్నం రామకృష్ణ పాల్గొన్నారు.

**తేనేటీ విందు కోసం ఇరు గ్రూపుల మధ్య పోటీ :** టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుకు తేనేటీ విందు ఇచ్చేందుకు తెలుగు తమ్ముళ్ల మధ్య పోటీ నెలకొంది. రాఘవేంద్ర స్వామి దర్శనం అనంతరం అబౌడే హోటల్‌కు ఆయన చేరుకున్నారు. జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి గ్రూపు, నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి గ్రూపు ఆయనకు అల్పాహారం, తేనేటీ విందు ఇచ్చేందుకు ఆహ్వానించారు. తిక్కారెడ్డి గ్రూపు నుంచి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి, అమర్‌నాథ్ రెడ్డి, ఇటు ఇన్‌ఛార్జీ తమ్ముడు, సొసైటీ ఛైర్మన్ ఎన్.రామకృష్ణారెడ్డి తమ ఇంటికి రావాలని ఆహ్వానించారు. పాలకుర్తి తిక్కారెడ్డి వాహనంలో పల్లా శ్రీనివాసరావు టిడిపి ఇన్‌ఛార్జీ ఇంటికి వెళ్తుండగా 'మా ఇంటికి కూడా రావాల'ని అమర్‌నాథ్ రెడ్డి కోరారు. 'మేము మొదటి నుంచి టిడిపిలో ఉన్నాం. వారు ఇటీవల పార్టీలోకి వచ్చార'ని అధ్యక్షులు ముందు తెలిపారు. ఎవరి ఇంటికి వెళ్లాలో తెలియక అధ్యక్షులు కొంతసేపు అయోమయంలో పడ్డారు. చివరికి మాధవరం గ్రామంలో టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్రరెడ్డి ఇంటికి వెళ్లి అల్పాహారం స్వీకరించారు. అక్కడ ఆయనకు రాఘవేంద్ర రెడ్డి సోదరులు శాలువా, రాఘవేంద్రస్వామి బృందావన ప్రతిమను ఇచ్చి సన్మానించారు. అనంతరం నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు అమర్‌నాథ్ రెడ్డి ఇంటికి వెళ్లి తేనేటి విందు స్వీకరించారు. టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి, నరవ రమాకాంత్ రెడ్డి, యువ నాయకులు ఎన్.రాకేష్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి పాల్గొన్నారు.

ఆలయ ప్రాంగణంలో ఉన్న నాయకులు

## నాగరాజ్ గౌడ్‌కు చెన్నకేశవరెడ్డి పరామర్శ

**ప్రజాశక్తి - నందవరం**

టిడిపి నాయకులు నాగరాజ్ గౌడ్‌ను మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పరామర్శించారు. నాగరాజ్ గౌడ్ అనారోగ్యంతో బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొంది స్వగృహం చేరుకున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, యువ నాయకులు ఎర్రకోట రాజీవ్ రేడ్డి శుక్రవారం ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం 11వ వార్డు మెంబర్ చాంద్ తాత కుమారుడు తాహెర్ బాష ఇటీవల మంత్రాలయంలోని గోశాల వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి చాంద్ తాత ఇంటికి వెళ్లి పరామర్శించారు. వైసిపి రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం నారాయణరెడ్డి, జడ్‌పిటిసి నిఖిల్ చక్రవర్తి, వైసిపి నాయకులు చుక్క మల్లేష్, లింగమూర్తి, వంటెద్దు మల్లప్ప, బుక్కిట్లా బసవరాజ్ గౌడ్, రంగముని, పంపయ్య, బుజ్జి బాబు, పల్లెగ్రామం సోమశంకర్ రెడ్డి, రాఘవరెడ్డి, రాజారెడ్డి, పెద్దకొత్తిలి సర్పంచి శివన్న, వెంకట్రామిరెడ్డి, రఘు, దస్తగిరి, శాంతిరాజు, మాచాపురం దానం, వరదరాజులు, ఆదాము పాల్గొన్నారు.

నాగరాజ్ గౌడ్‌ను పరామర్శిస్తున్న చెన్నకేశవరెడ్డి

## తహశీల్దార్ రామాంజనేయులు సస్పెండ్

**ప్రజాశక్తి - దేవనకొండ**

దేవనకొండ తహశీల్దార్ రామాంజనేయులును సస్పెండ్ చేస్తూ శుక్రవారం కలెక్టరేట్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. 2024వ సంవత్సరంలో చిత్తూరు జిల్లా సత్యవేడు తహశీల్దార్‌గా పనిచేసిన రామాంజనేయులు 300 ఎకరాల అటవీ భూములను తమిళనాడు రాష్ట్రానికి చెందిన కొందరు వ్యక్తులకు అక్రమంగా పట్టాలు మంజూరు చేసిన ఆరోపణలు ఉన్నాయి. ఈ మేరకు ఆయనతోపాటు మరో ఆరుగురు రెవెన్యూ సిబ్బందిపై కూడా చర్యలు తీసుకున్నట్లు సమాచారం. వీరిపై క్రిమినల్ కేసులు కూడా నమోదయ్యాయి. దేవనకొండ తహశీల్దార్ సస్పెండ్ కావడంతో డిప్యూటీ తహశీల్దార్ అమీనా బేగంకు ఇన్‌ఛార్జీ బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం.

## 'అక్రమ కేసులు ఎత్తేయాలి'

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

సాక్షి ఎడిటర్, నెల్లూరు విలేకరులపై అక్రమ కేసులను ఎత్తేయాలని ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు కోరారు. శుక్రవారం జర్నలిస్టు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన చేపట్టి, వినతిపత్రం అందజేశారు. నాయకులు షబ్బీర్, దేవేంద్రమూర్తి, రామకృష్ణ, నాగరాజు, రఘు, ఖలీల్, సాక్షి ఇన్‌ఛార్జీ ఉస్మాన్ బాష, ఎపిడబ్ల్యుజె నాయకులు శ్రీనివాస నాయుడు, పరమేష్, నాగరాజు, ఈరన్న, నాయకులు అబ్దుల్ రజాక్, శరత్, సిపిఐ పట్టణ కార్యదర్శి రంగన్న మాట్లాడారు. ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపితే, నకిలీ మద్యంపై వార్తలు రాస్తే తప్పుడు కేసులు బనాయించడం అసమంజసమని మండిపడ్డారు. కిరణ్, నాగభూషణం, రాజు, విజయ్ పాల్గొన్నారు.

## ఉద్యోగులకు బదిలీ సహజం : వైసిపి

**ప్రజాశక్తి - దేవనకొండ**

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీ సహజమని కొత్తపేట సర్పంచి షేకమ్మ కుమారుడు, వైసిపి గ్రామ నాయకుడు బాబు తెలిపారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు జోహార్ బాష, సుదర్శన్, నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు శుక్రవారం గ్రామస్తులు సన్మానం చేశారు. గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యనభ్యసించి మెగా డీఎస్సీలో ఉపాధ్యాయురాలుగా ఎంపికైన కరిడికొండ మస్తాన్ బీకి కూడా సన్మానం చేశారు. ఎంపిటిసి సురేంద్రబాబు, గ్రామ పెద్దలు వెంకటేష్, భీమేశప్ప, ఛైర్మన్ సూరిబాబు, కౌలుట్ల, మద్దిలేటి, రంగముని, మనోహర్ పాల్గొన్నారు.

## మోడీ పర్యటనతో ప్రయోజనం శూన్యం : సిపిఎం

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

ప్రధాని నరేంద్ర మోడీ జిల్లా పర్యటనతో ప్రజలకు ఏమీ ప్రయోజనం లేదని సిపిఎం ప్రాంతీయ కమిటీ కార్యదర్శి పి.గోవిందు, నాయకులు రమేష్, అబ్దుల్లా, బి.రాజు, తిమ్మప్ప విమర్శించారు. శుక్రవారం వారు మాట్లాడారు. జిల్లా పశ్చిమ ప్రాంతం నిత్యం కరువు, కాటకాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం కూటమి ప్రభుత్వానికి, ప్రధాన మంత్రికి పట్టదా అని ప్రశ్నించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక నిధుల కేటాయింపు ప్రస్తావనకే రాకపోవడం సిగ్గు చేటని విమర్శించారు.

## 'కెజిబివిలో వసతులు కల్పించాలి'

**ప్రజాశక్తి - కౌతాళం**

మాట్లాడుతున్న నాయకులు

కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఎఐఎస్ఎఫ్ మహిళా కన్వీనర్లు లత, మానస, నాగరత్న, సంగీత, వైశాలి, హర్ష డిమాండ్ చేశారు. శుక్రవారం కెజిబివిని సందర్శించి వారు మాట్లాడా రు. మండలంలో కెజిబివి హాస్టల్‌లో అనేక సమస్యలు ఉన్నాయని విద్యార్థులు తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన వాష్ రూమ్, టాయిలెట్స్‌లో నీరు లేక అపరిశుభ్రంగా ఉన్నాయన్నారు. విద్యార్థినులకు శుద్ధ తాగునీరు అందించాలని కోరారు. అనంతరం మండల అధ్యక్ష, కార్యదర్శులు హను మేష్, సాయివర్మ, జిల్లా కార్యవర్గ సభ్యులు గురు బసవరాజ్ మాట్లాడుతూ... కెజిబివి హాస్టల్ సమస్యలపై అధికారులు స్పందించి విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలన్నారు. లేకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## కుటుంబసభ్యులకు పిల్లల అప్పగింత

**ప్రజాశక్తి - మంత్రాలయం**

పిల్లలను కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న ఎస్ఐ

తప్పిపోయిన పిల్లలను ఎస్ఐ శివాంజల్ శుక్రవారం తల్లిదండ్రులకు అప్పగించారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరు సిటీ క్రైస్ట్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విశాల్, రంజిత్, తనీష్‌లు ఇంట్లో ఎవరికీ చెప్పకుండా గురువారం సాయంత్రం బెంగళూరు బస్టాండ్‌కు వచ్చారు. ధర్మస్థలం లేక చెన్నై వెళ్దామని వచ్చిన వారు తెలియక బస్సులో ఎక్కి మంత్రాలయం బస్టాండ్‌లో దిగారు. ఎక్కడికి వెళ్లాలో తెలియక రాఘవేంద్ర సర్కిల్ వరకు వచ్చి ఏడుస్తూ కనిపించారు. స్కూల్ యూనిఫారంలో ఉన్న వారిని గమనించిన హోంగార్డు నాగేశ్వర్ రెడ్డి పిల్లలను ఎస్ఐ వద్దకు తీసుకెళ్లారు. తల్లిదండ్రులకు సమాచారం అందించామని ఎస్ఐ తెలిపారు. శుక్రవారం నవిశాల్‌ను అతని తండ్రి మోహన్ కుమార్‌కు, రంజిత్‌ను అతని తండ్రి ఆయన చిన్నప్పకు, తనీష్‌ను అతని తాత ముని రాజయ్యకు అప్పగించారు. పిల్లలను తల్లిదండ్రులకు అప్పగించడంలో సహకరించిన హోంగార్డు నాగేశ్వర్ రెడ్డిని ఎస్ఐ అభినందించారు.

## సిజెఐపై దాడిని నిరసిస్తూ 23న 'చలో అమరావతి' : ఎంఆర్‌పిఎస్

**ప్రజాశక్తి - ఆదోని**

సిజెఐ గవాయ్‌పై దాడిని నిరసిస్తూ ఈనెల 23న 'చలో అమరావతి' నిర్వహిస్తున్నట్లు ఎంఆర్‌పిఎస్ నాయకులు తెలిపారు. సిజెఐ గవాయ్‌పై దాడిని నిరసిస్తూ శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ముందుగా ఆదోని మున్సిపల్ మైదానం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శనగా చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ నాయకులు చిన్న, మనోజ్, బండారి గిడ్డయ్య మాదిగ మాట్లాడారు. ఈనెల 6న కోర్టు హాలులో డయాస్‌పై ఉన్న సిజెఐ గవాయ్‌పై బూటుతో దాడికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. సుమోటుగా కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. దాడిని ప్రజా సంఘాలు, అభ్యుదయవాదులు ఖండిస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం సిగ్గు చేటని విమర్శించారు. 23న చేపట్టే చలో అమరావతిలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో అధికారికి వినతిపత్రం ఇచ్చారు. నాయకులు మణి, గుమ్మల బాలస్వామి, జగన్, వీరేష్, బాలస్వామి, హరి ఉన్నారు. **కౌతాళం** తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. తహశీల్దార్ రజనీకాంత్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎంఆర్‌పిఎస్ మండల కార్యదర్శి ఆనంద్, సీనియర్ నాయకులు రాజబాబు, శంకరప్ప, రాంబాబు, దళిత సమైక్య నాయకులు ప్రకాష్, మారెప్ప, తిమోతి, నాగరాజు పాల్గొన్నారు.

కౌతాళంలో నిరసన చేపడుతున్న నాయకులు

**IN THE COURT OF THE Ist ADDL. JUNIOR CIVIL JUDGE, ANANTHAPURAMU**
**O.S. No: 863/2021**
**Between:**
Pyapili Murali Krishna ...**Plaintiff**
**And**
Pyapili Sashikanth ...**Defendant**
**NOTICE TO THE DEFENDANT**
Pyapili Sashikanth, S/o Late P. Nagappa,, working as Assistant Commandant,2nd Battalion, APSP, Kurnool,
పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తము 17-12-2025వ తేది ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
**LAKSHMI PRASAD NAYUNIGARI,**
Advocate, Ananthapuramu,
Cell No: 9440889979

**IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE : PRODDATUR**
**E.P.No. 81/2024**
**O.S.No. 43/2023**
Nali Rama Krishna Yadav, S/o Late Pulla Reddy Yadav, D/No.26/922-2, Flat No.6, Varalakshmi Apartments, Guruvaiah Thota, Mittamadi Veedhi, Proddatur Town & Mandal, Kadapa Dist.
...**Petitioner/D.Hr.**
**Vs**
5. Komera Prasanna, D/o Chandra Sekhar, D.No.45/24-K45-1, Venkata Ramana Colony, Kurnool City & District.
6. Komera Prathyusha, D/o Chandra Sekhar, D.No.45/24-K45-1, Venkata Ramana Colony, Kurnool City & District.
7. Komera Sumasekhar, S/o Chandra Sekhar, D.No.45/24-K45-1, Venkata Ramana Colony, Kurnool City & District.
...**Respondents/J.Dr's**
**NOTICE TO JDR No.5 to 7**
Please take notice to the above E.P.filed by the D.Hr. for send for an amount Rs.8,68,368/- against the J.DR's No.5to 7 and the said matter is posted on 12.11.2025 for your appearance at 10.30 A.M. Please make it convienent to attend the above said Hon'ble court on the above said date and time either in person or through an advocate, failing which matter will be decided in your absence as per law, Please take notice accordingly.
**For Hg: 12.11.2025**
**G.V.BHASKAR REDDY**
**Advocate, PRODDATUR.**

# ప్రధాని పర్యటనలో ఆర్‌పిల ఇబ్బందులు

**-ఎదుర్కొన్న సమస్యలపై మెప్మా పిడికి వినతి**
**-ఎపి మెప్మా ఆర్పి ఉద్యోగుల సంఘం(సిఐటియు)**

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

ప్రధాని సభకు వెళ్లిన ఆర్‌పిలు, పొదుపు మహిళలు అనేక ఇబ్బందులు పడ్డారని, జిల్లా అధికారుల సమన్వయ లోపం వల్ల ఆర్‌పిలకు పొదుపు మహిళలకు సత్ సంబంధాలు దెబ్బ తినడానికి కారణమైందని శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి నిర్మల అన్నారు. ఈ విషయాలపై మెప్మా పిడిని కలిసి ఎపి మెప్మా ఆర్పి ఉద్యోగుల సంఘం (సిఐటియ) ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చామన్నారు. శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి నిర్మల మాట్లాడుతూ ప్రధాని పర్యటన కోసం గత పది రోజులుగా మెప్మా ఆర్పీలు పర్యటన విజయవంతం చేయాలని గ్రూప్ మీటింగ్‌లు, ఐక్య సంఘాల మీటింగ్ లు జరుపుతూ ప్రతిరోజు సభ్యుల పర్యటనకు వచ్చే వారి పేర్లు ప్రతి ఆర్పి 150 నుండి 250 ఆన్‌లైన్ చేశారు. ఈనెల 15న బస్సులు వస్తాయి రిసీవ్ చేసుకోవాలని సిఒలు చెప్పటం, లిస్టు ఇచ్చారన్నారు. ఆ లిస్టులో ఉన్న ప్రకారం చేసుకోవాలన్నారు. వచ్చిన బస్సులు సిఐఒలు ఇచ్చిన నెంబర్ ఒకటిగా లేవన్నారు. సిఒకి ఇచ్చిన లిస్టులో ఆర్పిపేరు బస్సు డ్రైవర్‌కు ఇచ్చిన ఎస్ఆర్‌లో ఇంకొక సిఒ పేరు నమోదు తో ఉన్నాయన్నారు. మరుసటి రోజు కొందరికి ఆ బస్సులు కూడా రాలేదని, మరికొందరికి బస్సులు మారాయని, కొందరు ఉన్న బస్సులో పొదుపు మహిళలు , కార్యకర్తలు ఎక్కారన్నారు. ఎన్నో ఇబ్బందులు పడి ఆర్పిలు కష్టపడి సమీకరిస్తే వారికి మంచినీళ్లు,టిఫిన్లు, భోజనం మధ్యాహ్నం ఒంటిగంట వరకు కూడా అందలేదన్నారు. పొదుపు మహిళలు అన్నం పెట్టలేనప్పుడు మీరు ఎందుకు తీసుకొచ్చారని ఆర్పీలను ప్రశ్నించడమే కాక అనరాని మాటలు అన్నారన్నారు. ఇది ఇలా ఉంటే కొంతమంది మహిళలకు కొందరు ప్రధాని సభకు 200 డబ్బులు ఇచ్చి తీసుకు వచ్చారని, మహిళలు చెప్పటంతో పొదుపు మహిళలు మాకు ఇవ్వలేదని, మీకు ఎంత ఇచ్చారని ఆర్‌పిలను ప్రశ్నించారు. శుక్రవారం కూడా ఇండ్ల దగ్గరికి వెళ్లి డబ్బులు ఇవ్వండి మీరు లక్షలు తెచ్చుకున్నారు. మాకెందుకు ఇవ్వరు

ఆర్‌పిల సంఘం నాయకులతో మాట్లాడుతున్న మెప్మాపిడి

అని గొడవకు దిగారు. మెప్మా అధికారులు ఎవరు కూడా సభాస్థలిలో లేరని, సభ అనంతరం బస్సుల దగ్గరికి వచ్చే సందర్భంలో వచ్చిన జనంలో తప్పిపోయి పొదుపు మహిళలు కొందరు ఆర్‌పిలు రాత్రి 9 గంటల తరువాత తమ ఇండ్లకు చేరుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి మెప్మా ఆర్పి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి. రుద్రమ్మ, ఎస్.ఉమాదేవి, నగర కార్యదర్శి ఎస్.షబానా, కోశాధికారి సుజాత, ప్రసాద్, నగర నాయకులు కైరున్,, సాయికృష్ణమ్మ, నాగమణి, జానకి, కన్యకా, వీణ,వాణి లలిత ,మంజుల, బి.జ్యోతి, సరస్వతి లక్ష్మీ, గౌతమి, బాలమ్మ, శ్రీదేవి వరలక్ష్మి, ఆర్.భారతి,నందిని,రేణుక రిజ్వాన,శ్యామల,ఉషారాణి తదితర ఆర్‌పిలు , సిఐటియునగర అధ్యక్ష కార్యదర్శులు నగేష్, నరసింహులు ఐక్యసంఘం అధ్యక్షులు ఎన్.అలివేలు, బిజాన్ బి తదితరులు పాల్గొన్నారు.

## ఆస్పత్రి శానిటేషన్ సిబ్బందితో అన్‌లోడింగ్ పనులు

**-అడ్డా హమాలీల కడుపు కొడుతున్న అధికారులు**
**-పోలీసుల అండతో హమాలి కార్మికుల గెంటివేత**
**-కర్నూలు జిజిహెచ్ అధికారులపై చర్యలు తీసుకోవాలి**
**-సిఐటియు నగర ఉపాధ్యక్షులు నాగరాజు డిమాండ్**

**ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్**

నిరసన తెలుపుతున్న హమాలీ కార్మికులు

కర్నూలు నగర పరిధి బుధవారపేట ఏరియాలలో నివాసముండి గత 30 సంవత్సరాల నుండి కార్మిక శాఖ కార్యాలయంలో యూనియన్ రిజిస్టర్ చేసుకుని లోడింగ్ అన్‌లోడింగ్ పనుల ద్వారా ఉపాధి పొందుతున్న హమాలి కార్మికులపై జిజిహెచ్ అధికారులు పనులు కల్పించకుండా పోలీసులను ఉసిగొలపుతున్నారని సిఐటియు నగర ఉపాధ్యక్షులు నాగరాజు అన్నారు. శుక్రవారం కర్నూలు జిజిహెచ్ ఆవరణలో ఆన్ లోడింగ్ చేసేందుకు వచ్చిన అడ్డా హమాలి కార్మికులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పనులు చేయకుండా హమాలీలు వెనుదిరిగారు. నాగరాజు మాట్లాడుతూ కర్నూలు మ్యూజియం హంద్రీబ్రిడ్జి నుండి కేసి కెనాల్ వినాయక టెంపుల్ వరకు, బుధవార్‌పేట ఏరియా నుండి లక్ష్మీ గార్డెన్ వరకు హమాలిపని చేసుకొంటు 60 మంది కార్మికులు కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. హమాలీల కడుపు కొడుతున్న హాస్పిటల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కర్నూలు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో, కలెక్టర్ ఆఫీస్ లోనూ, ప్రవేట్ షాపులలో చాలా సంవత్సరాల నుండి లోడింగ్ అన్‌లోడింగ్ చేస్తున్నారని, ప్రభుత్వ ప్రైవేటు కన్‌స్ట్రక్చర్ వర్కర్ల దగ్గర మెటీరియల్‌ను లోడింగ్ అన్‌లోడింగ్ చేసుకొని వాటి కూలీ ద్వారా జీవనం పొందుతున్నమని తెలిపారు. అలాంటి మాపై ఈ మధ్యకాలంలో హాస్పిటల్ అధికారులు హాస్పిటల్‌కు కావలసిన వస్తువులను, మెటీరియల్ వస్తే లోడింగ్ అన్లోడింగ్ పనులు మాకు చెప్పకుండా అక్కడ క్లీనింగ్ కోసం ఏర్పాటుచేసిన శానిటేషన్ వర్కర్స్‌ను భయపెట్టి లోడింగ్ అన్ లోడింగ్ చేయించుకోవడం ఏమిటని ప్రశ్నించారు. గురువారం హాస్పిటల్ లోనికి కొన్ని వస్తువులు లారీల ద్వారా వస్తే వాటిని అన్‌లోడింగ్ చేయడానికి హమాలీలు వెళ్ళగా హాస్పిటల్ అధికారులు అక్కడ ఉండే అవుట్ పోస్ట్ పోలీస్ అధికారులను తీసుకొని మా వర్కర్లను మమ్ములను భయపెట్టి మా పని లాక్కొని శానిటేషన్ వర్కర్స్‌తో చేయించడం సరైంది కాదని అన్నారు. ఇలాంటి వారి వలన ప్రభుత్వ జనరల్ హాస్పటల్ అవినీతికి అడ్డాగా మారిందని, దీనిపైన ప్రభుత్వ అధికారులు, కలెక్టర్ హాస్పిటల్ అధికారులు స్పందించి వారిపై చర్యలు తీసుకొని మా పని మాకు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. లేని పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు.

# బిఎస్‌ఎన్‌ఎల్ దీపావళి బంపర్ ఆఫర్లు

**-ఉచితంగా సిమ్ తో పాటు కేవలం**
**-రూ.1 రీఛార్జితో 30 రోజులు పాటు ప్రతిరోజు 2 జిబి డేటా, ఉచిత కాల్స్ ,100 ఎస్ఎంఎస్ లు**

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

బిఎస్ఎన్ఎల్ దీపావళి కానుకగా కొత్త వినియోగదారులకు ,పోర్ట్ ఇన్ అయ్యే వారికి ఉచితంగా 4జి సిమ్ ఇవ్వడంతో పాటు కేవలం ఒక్క రూపాయి రీఛార్జితో నెల రోజులపాటు అపరిమితమైన వాయిస్ కాల్స్, ప్రతిరోజు 2 జి బి హై స్పీడ్ డేటా,100 ఎస్ఎంఎస్‌లు అందిస్తున్నదని బిఎస్ఎన్ఎల్ కర్నూలు బిజినెస్ జనరల్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ జి రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆఫర్ 15 అక్టోబర్ నుండి 15 నవంబర్ వరకు ఉంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆత్మనిర్భర భారత్‌లో భాగంగా బిఎస్ఎన్ఎల్ పూర్తి స్వదేశీ సాంకేతికతతో తయారు చేసిన 4జి సేవలను భారత ప్రధానమంత్రి ఇటీవలే జాతికి అంకితం చేశారని తెలుపుతూ వినియోగదారులు దగ్గర్లో ఉన్న బిఎస్ఎన్ఎల్ సేవా కేంద్రం లేదా రిటైలర్ ను సందర్శించి ఈ ఉచిత ఆఫర్‌ను పొందాలని, ఇతర వివరాలకు 1800 4444 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేయవచ్చని తెలిపారు.

**ఎఫ్ టి టి హెచ్ సర్వీసులో అద్భుత ఆఫర్లు :** బిఎస్ఎన్ఎల్ భారత్ ఫైబర్ ఇంటర్నెట్ సర్వీస్‌లో ఫెస్టివ్ ఆఫర్ కింద అద్భుతమైన స్పెషల్ డిస్కౌంట్ లను ప్రవేశపెట్టారు. ఫైబర్ బేసిక్ నియో రూ.449 ప్లాన్ మరియు ఫైబర్ బేసిక్ రూ.499 ప్లాన్ తీసుకున్న వారికి మొదటి నెలలో ఉచితంగా సర్వీసులను పొందిన తర్వాత మూడు నెలల వరకు రూ. 50 , రూ100 డిస్కౌంట్ పొంద వచ్చని తెలిపారు.

**బిఎస్ఎన్ఎల్ సిల్వర్ జూబ్లీ ప్లాన్:** బిఎస్ఎన్ఎల్ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో భాగంగా ఎఫ్ టి టి హెచ్ వినియోగదారులకు కొత్తగా సిల్వర్ జూబ్లీ ప్లాన్ ప్రవేశపెట్టింది. ఈ ప్లాను కింద కేవలం రూ.625లకే , 75 ఎంఎబిపిఎస్ స్పీడుతో ఇంటర్నెట్ , స్కైప్రో హిందీ పుల్ ఫ్యామిలీ మ్యాక్స్ హెచ్‌డి ప్యాకేజీతో సుమారు 475 టీవీ ఛానల్ల ను , సోనీ లివ్ ప్రీమియం, జియో హాట్ స్టార్ సూపర్ ప్లాన్ ఓటిటిలను ఎటువంటి అదనపు చార్జీలు లేకుండా అందిస్తున్నామని తెలిపారు.

## కల్లూరు అర్బన్‌లో కోటి సంతకాల సేకరణ

**-ప్రారంభించిన కాటసాని రాభూపాల్ రెడ్డి**

**ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్**

వైసిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం కార్యక్రమం కల్లూరు అర్బన్‌లో చేపట్టారు. కాటసాని రాంభూపాల్ రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. స్థానిక వైసిపి నాయకులు, కార్పొరేటర్లు, వార్డులోని సభ్యులు, అనుబంధం విభాగాల వివిధ హోదాల్లో ఉన్నవారు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు..

మాట్లాడుతున్న కాటసాని రాభూపాల్ రెడ్డి

## ఘనంగా రాజవర్ధన్ రెడ్డి జయంతి

**ప్రజాశక్తి -కోడుమూరు**

మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న టిడిపి ఆఫీస్‌లో కర్నూల్ కెడిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి తనయుడు మాజీ ఎంపిపి రాజా వర్ధన్ రెడ్డి 47వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కోడుమూరు మండల కన్వీనర్ రామకష్ణారెడ్డి అధ్యక్షతన రాజవర్ధన్‌రెడ్డి జయంతి వేడుకలను స్థానిక టిడిపి నేతలు ఘనంగా జరుపుకొని కేక్ కట్ చేసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ స్వర్గీయ రాజవర్ధన్ రెడ్డి మంచికి మానవత్వానికి అనురాగానికి ప్రతీకగా నిలిచారని కొనియాడారు. పట్టణ అధ్యక్షులు గంగాధర్ నాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆయనను స్మరించుకుంటూ ఆయన అడుగుజాడలలో నడవాలని కోరారు. గంగాధర్ నాయుడు రాజా వర్ధన్ రెడ్డిని స్మరించుకుంటూ ఉద్వేగానికి గురయ్యారు. కార్యక్రమంలో నిరుపేదలకు చీరల పంపిణీ, వద్ధులకు అన్నదానం చేశారు. అనంతరం గవర్నమెంట్ హాస్పిటల్ నందు రోగులకు బ్రెడ్లు, పళ్ళు పంపిణీ చేశారు. కర్నూల్ లో రాజవర్ధన్ రెడ్డి చిత్రపటానికి వెంకటగిరి రాజు, మాల మునిస్వామి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. పులకుర్తి సింగిల్ విండో అధ్యక్షులు త్రివేది, గోరంట్ల మధు, గోపాల్ నాయుడు, కోడుమూరు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఎల్లప్ప నాయుడు, అయ్యప్ప, రవి, తదితరులు పాల్గొన్నారు.

బెళగల్ ఎన్‌టిఆర్ పార్కులో రాజవర్ధన్‌రెడ్డి కి నివాళి అర్పిస్తున్న టిడిపి నాయకులు

## రాజవర్ధన్ రెడ్డికి ఘననివాళి

**ప్రజాశక్తి- సి బెళగల్**

జిల్లా ప్రముఖ రాజకీయ నాయకులు, కెడిసిసిబి జిల్లా చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి కుమారుడు రాజవర్ధన్‌రెడ్డి జయంతి వేడుకలు శుక్రవారం మండల టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఎన్‌టిఆర్ పార్కులో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం కేక్ కట్ చేసి రాజవర్ధన్ రెడ్డీ అకాల మరణం కలచి వేసిందని ఆయన జ్ఞాపకాలు, ఆశయాలు మమ్ములను ముందుకు తీసుకెళ్తున్నాయని పలువురు పేర్కొన్నారు. అనంతరం ఒకరి నొకరు కేక్ తినిపించుకోని స్మరిస్తూ జయంతినీ ముగించారు.

## అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించండి

**ప్లానింగ్ కార్యదర్శులకు కమిషనర్ ఆదేశం**

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

నగరంలో అనధికారిక లేఅవుట్లను ఈ నెల 23 లోపు క్రమబద్ధీకరించుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ ప్రజలను కోరారు. శుక్రవారం నగరపాలక సమావేశ భవనంలో ఓపెన్ ఫోరం కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకానికి విశేష స్పందన లభించిందన్నారు. రెండు విడతల్లో 1,180 దరఖాస్తులు అందుకున్నట్లు చెప్పారు. ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే, దరఖాస్తులు వేగంగా ఇవ్వాలని ప్రజలను కోరారు.కార్యక్రమంలో సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డిసిసి వెంకటరమణ, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ భాష, సూపరింటెండెంట్ సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

## సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ పై దాడికి నిరసన

**ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్**

సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బి ఆర్ గావాయ్ పై డాడీ చేసిన వ్యక్తిని అతని వెనుక ఉన్న వారిని గుర్తించి అరెస్ట్ చేయాలనీ ఎం ఆర్ పి ఎస్ నాయకులు పాముల కుమార్, సూరి, రమేష్, విజయ్, మధు డిమాండ్ చేశారు. శుక్రవారం కల్లూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో సుప్రీం చీఫ్ జస్టిస్ పై దాడిని ఖండిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు.వారు మాట్లాడుతూ చీఫ్‌జస్టిస్‌పై దాడిని ప్రజాస్వామ్య వాదులందరు ఖండించాలన్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. నాయకులు పరమేష్, నాగరాజు అనిలకుమార్, తదితరులు పాల్గొన్నారు